3

# చిగురు

ఆ ఫ్యాక్టరీ పర్సనల్ మేనేజర్ యొక్క ఏర్ కండిషన్డ్ గదిలో నుండి బయటకొచ్చి-

మెట్ల పైనుండి బూట్లు టక్...టక్....టక్....టక్.-

బాగా మాసిపోయి ఉన్నాయి బూట్లు.

బూట్ల పైనున్న పాంట్ బాగా అరిగిపోయి... దారాలు బయటకు తేలి, నలిగిపోయిన కాగితంలా చురుకుదనం కోల్పోయి... పైన టక్ చేసిన బెల్ట్ కూడా పాలిష్ లేక నిస్తేజంగా... చొక్కా తడిచిన కాగితంలా నునుపుదనం కోల్పోయి, ముఖం.... కొద్దిగా పెరిగిన గడ్డంతో, చురుగ్గా అగ్ని గోళాల్లా ఉన్న కళ్ళతో, కసి నిండిన చూపులతో... మెదడులో మంటలంటుకున్న పెట్రోల్ టాంకర్‌లా తగలబడ్తున్న ఆలోచనలతో-

చేతిలో ఫైల్.... నలిగిపోతున్న ఫైల్. ఫైల్‌లో నలిగిపోతున్న సర్టిఫికేట్లు.

బి.టెక్. -మెకానికల్ . తొంబైరెండు శాతం మార్కులతో డిస్టింక్షన్‌లో పాసై.

గోల్డ్ మెడల్-

కాన్వొకేషన్‌లో గవర్నర్ నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్నప్పుడు చప్పట్లు... ఆకాశం దద్దరిల్లేలా చప్పట్లు.

యూనివర్సిటీ ప్రాంగణం నుంచి బయటకొస్తూంటే బాణంలా దూసుకుపోయే ఆశలు.. పెద్ద ఫ్యాక్టరీలో ఉద్యోగం... ఫర్నిష్డ్ క్వార్టర్... కంపెనీ వెహికల్ విత్ ఆల్ పెర్క్స్.... తన క్రింద ఎందరో లేబర్, టెక్నీషియన్స్.... ఏర్ కండిషన్డ్ ఆఫీస్... ఫైళ్ళపై సంతకాలు.... ఎదురుగా లేడీ స్టెనో.

ప్చ్-

కల చెదిరిపోయింది.

శిథిలాలు... ఒట్టి శిథిలావశేషాలు మిగుల్తున్నాయి.

వాస్తవంగా ఉద్యోగ రంగంలోకి దిగేక....

డోన్ట్ కేర్ యువర్ గోల్డ్‌మెడల్.... కీప్‌యువర్ డిస్టింక్షన్ విత్ యు. రన్....రన్ ఎవే....రన్ ఔట్.

గో అప్-

కమ్ డౌన్

మెట్లు.... మెట్లు.... మెట్లు

ఎక్కుడు మెట్లు

దిగుడు మెట్లు - కాని ఉద్యోగం లేదు.

ఉద్యోగం రాదు

ఉద్యోగం వచ్చే సూచన ఏ మాత్రం లేదు.

రోడ్లపై కాళ్ళు... కాళ్ళతో బూట్లు....... బూట్లతో హృదయం ..... హృదయం నిండా కన్నీళ్ళు.....

కన్నీళ్ళనిండా ఆకలి... ఆకలి... ఆకలి..

ఆకలిలో జీవితం తగలబడిపోతోంది.

ఆకలిలో బంగారు పతకం తగలబడిపోయింది.

ఆకలిలో డిస్టింక్షన్ తగలబడి బూడిదైపోయింది.

రాత్రులకు రాత్రులు-కళ్ళనిండా ఆలోచనలతో మెదడు నిండా మండే స్తబ్దతతో నిద్ర తరుమబడ్డ పక్షిలా దేహం నుండి ఎగిరిపోయి,

ఎన్ని నిద్రలేని-నిద్ర రాని రాత్రులో.

ఐనా ప్రయత్నం మానవద్దు-ధైర్యం వీడవద్దు, పోరాటం విరమించవద్దు.

పునరుత్సాహాన్ని పుంజుకుని, పంజా విప్పబోతూన్న ఆకలిని బుజ్జగించి పడుకోబెట్టి.

మళ్ళీ రోడ్డుపైకి... ఫ్యాక్టరీల్లోకి, మేనేజర్ల వెన్నెల గుహల్లోకి.... నాగరికత పులిమిన వెకిలినవ్వుల అడవుల్లోకి, ముద్దు సంజాయిషీల్లోకి, సమాధానాల్లోకి సానుభూతిని కురిపిస్తూ నాజూకైన పెదవులు చెప్పే "నో"ల లోకి, "సారీ" ల్లోకి-

ఎండలు గడుస్తున్నాయి.

శిశిరాలు గడుస్తున్నాయి.

ఆకులు రాలుతున్నాయి.

మళ్ళీ ఆకులు మొలుస్తున్నాయి.

చిగుళ్ళు. చిగురిస్తూనే బ్రతకలేక ఊడిపోయి, వాడిపోయి, రాలిపోతూ... వర్షాలు కురుస్తున్నాయి

కళ్ళలో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి.

గుండెల్లో నిరంతరం వర్షమే... అశ్రువర్షం.

కాని... పెదవులపై నవ్వు.

తప్పనిసరైన నవ్వు.... నవ్వుతూనే యాచన ఉద్యోగం కోసం. బుక్కెడు బువ్వకోసం... అయ్యా ఈ నా ఇంజనీరింగ్ డిగ్రీని కుదువబెట్టుకుని. ఈ నా డిస్టింక్షన్ పొందిన మెదడును తాకట్టు పెట్టుకుని, ఈ నా మండే ఆకలిని చల్లార్చేందుకు ఓ పిడికెడు మెతుకులను దానం చెయ్యండయ్యా అని... దీనాతి దీనమైన యాచన.

కాని ఈ దేశంలో ఎవడా నాథుడు నన్ను కుదువబెట్టుకుని నా డిగ్రీకి తగ్గ ఓ వైట్ కాలర్ ఉద్యోగాన్ని ప్రసాదించేవాడు.

వైట్ కాలర్ జాబ్.

డిగ్రీ... డిగ్రీకి తగ్గ ఉద్యోగం...హుందాతనం.

లెవెల్...లో లెవెల్... హై లెవెల్

ఐటిఐ... డిప్లమో హోల్డర్.... డిగ్రీ.... మాస్టర్ డిగ్రీ.

లేబర్... టెక్నిషియన్... సూపర్ వైజర్. ఇంజనీర్....

ఎవరు ఏ పని చేయాలో నిర్దేశించే అర్హతలు.

అర్హతలు... క్వాలిఫికేషన్స్ ముందుగానే మెదడు నిండా దట్టించి పెట్టే ఓ మిథ్యా ప్రపంచం... డిగ్నిటీ.

ఈ డిగ్నిటీని... ఈ సాంఘిక దుష్ట హోదాలను, కృత్రిమ కల్పిత దురహంకారాలను మనసు నిండా కప్పుకుని

లొంగిపోలేక... తలెత్తుకుని నడువలేక-కుమిలి...కుమిలి.

అమ్మా....నలిగిపోతున్నాను. ఆకలిలో, కన్నీళ్ళలో, బీదరికపు కోరల్లో, వైట్‌కాలర్ బురఖాలో... నలిగిపోతున్నాను...

పారిపోవాలి... ఈ జనారణ్యం నుండి... ఈ ఫ్యాక్టరీల ప్రాంగణాల్లో నుండి...

ఎక్కడికి.... ఎక్కడికి... పారిపోవడమెక్కడికి.... కడుపులో ఆకలిని, అగ్నిని పెట్టుకుని పారిపోవడమెక్కడికి....

బూట్లు.... అరిగిపోయిన బూట్లు. నిరుద్యోగియైన ఓ ఇంజనీర్‌ని, నిపుణుణ్ణి, మండే ఆకలిని మోస్తున్న బూట్లు, చిరిగిపోబోతున్న బూట్లు, అలసిపోయిన బూట్లు.

ఆగి....,

చిన్న టీకొట్టు ముందాగి....

చేతులు జేబులను వెదుకుతున్నాయి.

ఒక జేబు ఖాళీ... మరో జేబూ ఖాళీ....

అక్కడ ఫ్యాక్టరీల్లో ఖాళీ ల్లేవు... యిక్కడ జేబుల్లో ఖాళీలు తప్పితే ఇంకేమీ లేవు.

కాని టీ తాగాలి.... తప్పదు....

రెండ్రోజులైంది అన్నం తిని... శరీరం సోలిపోతోంది.

వెనుక ప్యాకెట్‌ను వెతుకుతున్నాయి చేతులు ఆశగా.

అల్యూమినియం బిళ్ళలు... పెంకుల్లా తాకి... వ్రేళ్ళు బయటికి పట్టుకొచ్చి- పది...ఇరవై.... ముప్పయ్, అరవై ఐదు-

"ఎక్ చాయ్ దేవ్"

చెక్క బెంచీపై కూలబడ్డాడు.

చాయ్ ఎంత... ఎనభై పైసలు.... కాని... ఉన్నవెన్ని.....

ఎన్నయినా కాని... ముందు ఆకలి....

ఆలోచన వద్దు...సంఘర్షణ వద్దు.... మంటపై నీరు చల్లాల్సి వచ్చినప్పుడు ఆ నీరు ఎలాంటిది. ఎక్కడిది అన్న మీమాంస వద్దు-

ప్రక్కన ఏదో స్కూటర్ గ్యారేజ్ వుంది.

మెకానిక్ స్కూటర్‌ని రిపేర్ చేస్తున్నాడు దీక్షగా. ఇంజన్ నడుస్తోంది. ఓ క్రమబద్ధమైన లయతో.

టక్...టక్...టక్...టక్‌టక్...టక్...టక్...టక్-

ప్రక్కన దాని ఓనర్ కూర్చుని శ్రద్ధగా గమనిస్తున్నాడు మెకానిక్ చేస్తున్నదాన్ని.

"లీటర్‌కు యిరవై ఆరే ఇస్తోందయ్యా. మొన్న నాజిల్ మార్చావుగదా. తర్వాత కార్బ్యురేటర్ ఫ్లోట్, వాల్వ్ మార్చావుగదా, బీటింగ్ సౌండ్ మారలేదు. మైలేజ్ పెరగలేదు. ఏం జేస్తావో చూడు."

మెకానిక్ కార్బ్యురేటర్ క్లీన్ చేసి బిగించి మళ్ళీ కిక్ కొట్టాడు.

టక్... టక్... టక్... టక్.... టక్.

ఏం మార్పు లేదు.

మెకానిక్ - ఇంజనీర్.

ఏమిటి భేదం?

యంత్రంలో ఫలానా లోపం రాగానే ఫలానా నట్‌ను బిగించు, ఫలానా భాగాన్ని వదులుచెయ్. లేక ఫలానాదాన్ని మార్చు. అన్నీ బండగుర్తు విజ్ఞానం కలవాడు మెకానిక్.

అలా కాకుండా ఫలానా యంత్రంలో లోపం ఎందుకొచ్చిందో శాస్త్రీయంగా తెలుసుకుని, దాన్ని పరిహరించాలంటే ఎందుకు ఫలానా నట్‌ను బిగించాలో లేక వదులు చేయాలో తెలిసి చేసే సాంకేతిక నిపుణుడు ఇంజనీర్.

దురదృష్టవశాత్తు ఈ దేశంలో మెకానిక్స్ ఎవరూ ఇంజనీర్స్ కారు.

లేక ఇంజనీర్లెవ్వరూ మెకానిక్స్‌గా పనిచేయడం లేదు.

మెకానిక్కే ఇంజనీరైతే.

ఇంజనీరే మెకానిక్కయితే

నో వైట్ కాలర్.... నో బ్లాక్ కాలర్.... నో కలర్.

మెదడులో ఓ గేలక్సీ వెలిగింది.

శరీరం నిండా ఏదో విద్యుత్తు ప్రవహిస్తోంది.

ఉత్సాహం సముద్రంలా పొంగుతోంది.

ప్రక్కనున్న మెకానిక్ నుద్దేశించి- "సౌండ్ చెప్తోంది గదయ్యా ప్రెషర్ లీకేజ్ ఉంది. పిస్టన్ రింగ్స్ మార్చు మైలేజ్ ఇంప్రూవ్ ఔతుంది. ప్రస్తుతం బండికి పికప్‌కూడా లేదు గదా సార్" అన్నాడు కస్టమర్‌తో.

"యూ ఆర్ కరెక్ట్"

"గో ఫర్ న్యూ పిస్టన్ రింగ్స్"

మెకానిక్ గౌరవ భావంతో చూశాడు అతని వంక.

కాలేజీ లాబొరేటరీలో... యంత్రాలతో ప్రయోగాలు, ఫ్యుయల్ ఎకానమీ ట్రయల్స్... మెకానిజం- రాత్రింబవళ్ళు పడ్డ శ్రమ.

"టీ ఎంత?"

"నలభై పైసలు"

"ఎనభై గదా"

"అన్న చాయ్... నలభయ్యేసర్"

నలభై పైసలిచ్చి.... నడుస్తున్నాడు. తలెత్తుకుని నడుస్తున్నాడు... ఆకలితో హృదయం నిండా ఖచ్చితమైన నిర్ణయంతో, విశ్వాసంతో, దీక్షతో.

ఉద్యోగం చేయాలంటే.... ఎవరో ఒకరు తన కోసం ఉద్యోగం సృష్టించి... తనకిచ్చి

తను ఒక డిపెండెంట్... ఉద్యోగం కోసం యాచన.

ఉద్యోగాన్ని అడిగే స్థితినుండి ఉద్యోగం యిచ్చే దిశలో ఆలోచించి విజృంభిస్తే...

ఒక నెల తర్వాత,

"భారతీయ ఆటో గ్యారేజ్"

-మెకానిక్! ఆర్.మోహన్. బి.టెక్ మెకానికల్

- దగ్గర...

ఎన్నో కార్లు... ఎన్నో స్కూటర్లు, మోటార్ సైకిల్స్ ఆస్పత్రిలో రోగుల్లా. వాటి నడుమ మాసిన బట్టలతో, మట్టి అంటిన నెత్తితో, స్పానర్ సెట్‌తో నడుస్తూ వెళ్తున్నాడు మోహన్ వెంట ఐదారుగురు అసిస్టెంట్లతో.

అతని జేబులో లొంగిపోయిన నోట్లున్నాయి.

నూనె మరకలతో, కందెనతో మాసిన అతని ముఖంలో జీవితాన్ని జయించిన ఆత్మవిశ్వాసముంది.

'ఆంధ్రజ్యోతి' వారపత్రిక, 04.05.84
ఉగాది కథలపోటీలో బహుమతి పొందినది